## క్లుప్తంగా

### పారిశుద్ధ్య సిబ్బందికి అలవెన్సులు పంపిణీ



**అమృతలూరు(భట్టిప్రోలు):** అమృతలూరు గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి సోమవారం సర్పంచ్ దేవరకొండ రాము దుస్తులు పంపిణీ చేశారు. అలాగే పారిశుద్ధ్య సిబ్బంది, క్లాప్ మిత్రలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. వీరికి ప్రతి ఏటా అందించే అలవెన్సులు దుస్తులతో పాటు కొబ్బరి నూనె, సబ్బులు, గ్లౌజులు, మాస్కులు, టవల్స్, పాదరక్షలు అందించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న పారిశుద్ధ్య కార్మికుడు మల్లెల బాబురావుకు కూడా స్వయంగా ఇంటికి వెళ్లి అలవెన్సులు అందజేశారు. సర్పంచ్ రాము మాట్లాడుతూ గ్రామంలో ఎనలేని సేవలు అందిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే విధంగా పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారని అన్నారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు సంకర మనోహర్, ఆలూరి స్నేహలత, కార్యదర్శి సీహెచ్ బాలకృష్ణ మూర్తి, జేఏఏ శ్రీనివాసరావు, బిల్ కలెక్టర్ రిజ్వాన్ బాబు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవు



**చెరుకుపల్లి:** ఎరువులు, పురుగు మందులు రైతులకు ఎక్కువ ధరకు విక్రయిస్తే షాపు యజమానిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఏఓ తనిఖీ చేసి అందులో ఉన్న నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రతి ఎరువుల దుకాణం వద్ద ధరలు, ఎరువుల నిల్వలు బోర్డులో పొందుపరచాలన్నారు. రైతులు కూడా ఎరువులు పురుగు మందులు కొన్నప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు.

### జాబ్ మేళా ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగాలు



**వేమూరు:** నిరుద్యోగులకు జాబ్ మేళా ద్వారా ఉద్యోగాలు కల్పించడం జరిగిందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, ఈ జాబ్ మేళాకు 31 మంది హాజరు కాగా 12 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రతి నెల ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశం వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్లేస్మెంట్ అధికారి బి.శ్రీనివాస్, హబ్ కోఆర్డినేటర్ రత్న రాజేశ్వరి, జేఆర్పీ అరుణ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

### ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోండి



**తెనాలిఅర్బన్:** విద్యార్థి దశలోనే ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా అందరూ కృషి చేయాలని అమృత ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ డాక్టర్ తులసి పేర్కొన్నారు. ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక విద్యకు ఎక్కువ అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. అందరూ వాటిని అందిపుచ్చుకుంటూ ముందుకు సాగాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ వీబీఎస్ అజయ్, వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్ర, పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇవి మీరు పొందవచ్చు.. తెలుసా..?

- పెట్రోలు బంకుల్లో కనుమరుగవుతున్న కనీస వసతులు
- నిబంధనలు పాటించకపోయినా అధికారుల చర్యలు శూన్యం



కనీస వసతులు లేని చావలిలోని పెట్రోల్ బంక్

**వేమూరు:** పెట్రోలు బంకుల్లో అధికారుల పర్యవేక్షణ లోపించడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. బంక్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు అంటున్నారు. వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో 17 పెట్రోలు బంక్లు ఉన్నాయి. ఈ బంక్ల్లో కనీస వసతులు కనుమరుగయినా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.

**బంక్ల్లో ఉండాల్సిన సౌకర్యాలు ఇలా...**

- బంక్లో స్వచ్ఛమైన తాగు నీటి సదుపాయం కల్పించాలి. దీని కోసం పెట్రోలు పంప్ డీలర్ ఆర్వో మిషన్, వాటర్ కనెక్షన్ ఏర్పాటు చేయాలి.
- పరిశుభ్రమైన మరుగుదొడ్లు ఉండాలి. స్త్రీ, పురుషులకు విడివిడిగా వాష్ రూమ్స్ ఉండాలి.
- ప్రతి పెట్రోలు బంక్ వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్ విధిగా ఉండాలి. దీంతో ఏవైనా ప్రమాదాలు జరిగితే బంక్ల్లో ప్రథమ చికిత్స అందించేందుకు వీలు ఉంటుంది.
- టైర్లకు గాలి నింపడానికి బంక్ వద్ద ఎయిర్ మిషన్ తప్పనిసరిగా ఉండాలి. ఇందు కోసం ఎలక్ట్రానిక్ యంత్రాన్ని గాలిని నింపడానికి ప్రత్యేకంగా వ్యక్తిని ఏర్పాటు చేయాలి. సౌకర్యాలతో పాటు వినియోగదారులకు పెట్రోల్, డీజిల్ నాణ్యత, పరిమాణాన్ని తెలుసుకునే హక్కు కూడా ఉంది.

బంక్ల్లో ఎలాంటి సౌకర్యాలు లేకపోయిన అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని బంకులకు షెడ్యూల్ కూడా లేకపోవడంతో బంక్లో పని చేసే కార్మికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి పెట్రోలు బంక్లో కనీస వసతులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. అలాగే ప్రతి బంక్ వద్ద ఎయిర్ మిషన్ ఏర్పాటు చేయాలని పలువురు వాహనదారులు అడుగుతున్నారు. అంతేకాక కొన్ని బంక్ల్లో ఎయిర్ మిషన్లు ఉంటున్నా అవి అలంకారప్రాయంగానే ఉంటున్నాయి.

**తాగునీరు ఏర్పాటు చేయాలి**



పెట్రోలు బంక్లో వాహనదారులకు తాగునీరు తప్పకుండా ఏర్పాటు చేయాలి. కొన్ని బంక్ల్లో తాగునీటి సౌకర్యం లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పెట్రోలు బంక్ నిర్వాహకులు తప్పకుండా తాగునీటి సౌకర్యం కల్పించాలి.

– గుమ్మడి దానియేలు వేమూరు

**ఎయిర్ మిషన్ ఏర్పాటు చేయాలి**



పెట్రోలు బంక్ల నిర్వాహకులు బంక్లో ద్విచక్ర వాహనాలకు, కారులకు గాలి కోసం ఎయిర్ మిషన్ ఏర్పాటు చేయాలి. కొన్ని బంక్ల్లో నిర్వాహకులు ఎయిర్ మిషన్ ఏర్పాటు చేయలేదు. అధికారులు ప్రతి బంక్ల్లో ఎయిర్ మిషన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– అల్లూరు యోనబాబు, జంపని

# ప్రతి ఒక్కరు జీసస్ మార్గంలో నడవాలి

**జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి**



సెమి క్రిస్మస్ వేడుకల్లో క్యాండిల్ లైటింగ్ చేస్తున్న జిల్లా కలెక్టర్

**బాపట్లటౌన్:** సమాజంలోని ప్రతి ఒక్కరు జీసస్ చూపిన మార్గంలో నడుచుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాల్లో సోమవారం రాత్రి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ, క్రైస్తవ మైనారిటీ ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ లోక రక్షకుడైన ఏసుక్రీస్తు జన్మించిన రోజును క్రిస్మస్ పర్వదినంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రేమ, అభిమానాలతో జరుపుకుంటారన్నారు. క్రైస్తవులకు క్రిస్మస్ పండగ గొప్పదని, ఈ పండుగను అందరూ కుటుంబ సభ్యులందరితో కలిసి ఆనందోత్సవాలతో జరుపుకోవాలన్నారు. ప్రపంచ మానవాళికి ప్రేమ, దయ, అహింసా మార్గాన్ని క్రీస్తు చూపారన్నారు. ఇతర వ్యక్తుల పట్ల ప్రేమ, దయ కలిగి ఉండాలని అన్నారు. ధర్మాన్ని నువ్వు కాపాడితే అది నిన్ను కాపాడుతుందన్నారు. ఈనాటి యువత సామాజిక మాధ్యమాలలో వచ్చే వీడియోలు, సినిమాలు చూస్తూ హింసకు పాల్పడుతున్నారన్నారు. విద్యార్థులు దైవత్వాన్ని ఆచరిస్తూ హింస వైపు వెళ్లకుండా ఉండాలని తెలిపారు. అనంతరం కొవ్వొత్తిలు వెలిగించి, కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.గంగాధర్ గౌడ్, రెవెన్యూ డివిజన్ అధికారి పి.గ్లోరియా, మైనార్టీ సంక్షేమ శాఖ, క్రైస్తవ మైనార్టీ ఆర్థిక సంస్థ అధికారి షేక్ మహబూబ్ షరీఫ్, జిల్లా అధికారులు, లూథరన్ పాస్టర్ రెవరెండ్ డా.వరబాబు, సాల్వేషన్ ఆర్మీ మేజర్ ఏసుదాసు పాల్గొన్నారు.

### నూతన వస్త్రాలు అందజేత



**చెరుకుపల్లి:** కుల మత రహిత సమాజం నిర్మించి తోటివారిని ప్రేమిస్తూ జీవించటమే క్రిస్మస్ సందేశమని నాన్నగారు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు పొన్నపల్లి సత్యన్నారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని గుళ్ళపల్లి గ్రామంలో నాన్నగారు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్రిస్మస్ పురస్కరించుకొని గుళ్ళపల్లిలోని క్రైస్తవ మహిళలకు పొన్నపల్లి సత్యన్నారాయణ, సునీల దంపతులు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సత్యన్నారాయణ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా నాన్నగారు స్వచ్ఛంద సంస్థ ద్వారా గ్రామాల్లోని అన్ని వర్గాల పేద ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు, మున్ముందు మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి పేదలకు అండగా ఉంటామని తెలిపారు.

# సాయం చేసే గుణాన్ని నేర్పిన వ్యక్తి రైతు

**ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి**



ప్రకృతి వ్యవసాయంలో ఉత్తమ సేవలు అందిస్తున్న ఐసీఆర్పీ తోకల జాన్శ్రీని సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీవో

**భట్టిప్రోలు:** అందరి ఆకలి తీర్చడం కోసం నిస్వార్థంగా వ్యవసాయం చేస్తున్న రైతులే నిజమైన హీరోలని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి అన్నారు. ప్రతి సోమవారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకు కూరలతో ఏర్పాటు చేసిన స్టాల్లో విక్రయాలు నిర్వహిస్తున్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా వ్యవసాయంలో ఉత్తమ సేవలు అందిస్తున్న ఐసీఆర్పీ తోకల జాన్శ్రీని ఎంపీపీ లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరితో కలసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ వ్యవసాయం అనే పదంలోనే సాయం ఉందని.. అగ్రికల్చర్ అనే మాటలో కల్చర్ ఉందని అన్నారు. ప్రపంచానికి కల్చర్ని, సాయం చేసే గుణాన్ని నేర్పిన ఒకే ఒక వ్యక్తి రైతు అని తెలిపారు. జెడ్పీటీసీ ఉదయభాస్కరి మాట్లాడుతూ వ్యయం పెరిగినా సాయం మరువని వాడు.. పొలంలో నడుము వంచి దేశానికి వెన్నెముకగా నిలిచే వాడు రైతు అని పేర్కొన్నారు. రైతు చేయి మట్టిలోకి వెళ్లినప్పుడే మన ఐదు వేళ్లు నోట్లోకి వెళతాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్వీ రమణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ జలజ, ఈవోపీఆర్డీ టి.ఊహారాణి, ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ నీలం ప్రకాష్ కుమార్, సీసీ నరేంద్ర, యూనిట్ ఇన్చార్జిలు దోవా ఝాన్సీ, సునీత, పాండురంగారావు, ఐసీఆర్పీలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# సమస్యలు తెలిపేందుకు సౌకర్యం ఏదీ..?

- బస్సులు లేక రాలేకపోతున్న బాధితులు
- సీపీఐ సీనియర్ నాయకులు జె.బి.శ్రీధర్

**బాపట్లటౌన్:** జిల్లా కార్యాలయం, ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కానీ జిల్లా నలుమూలల నుంచి ప్రజలు కలెక్టర్ కార్యాలయానికి వచ్చేందుకు సౌకర్యం లేకుండా పోయిందని సీపీఐ సీనియర్ నాయకులు జె.బి.శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. శ్రీధర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కారం జరగక జిల్లా కేంద్రం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వస్తున్న అర్జీదారులకు సరైన బస్సు సౌకర్యం సమయానికి లేనందున పల్లెల నుంచి మండలాలకు.. అక్కడ నుంచి పట్టణాలకు వచ్చి జిల్లా కేంద్రానికి రావాల్సి వస్తుందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కార్యాలయానికి చేరుకునే సరికి ఇక్కడ సమస్యల పరిష్కార వేదిక ముగుస్తుందన్నారు. కనీసం ప్రతి సోమవారం రోజైనా జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి ప్రత్యేక బస్సులను నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, అద్దంకి నియోజకవర్గ కార్యదర్శి తుమ్మల పూర్ణ చంద్రశేఖర్, బల్లికురవ మండల కార్యదర్శి గెల్ల వెంకటప్పయ్య, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు వల్లేపు నరసింహం, కె.శ్రీను పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలి

**రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు**




డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హెల్మెట్పై అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

**చెరుకుపల్లి:** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణం చెయ్యాలని రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు వాహనదారులకు సూచించారు. సోమవారం బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు చెరుకుపల్లి మండల కేంద్రంలో రేపల్లె సర్కిల్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బందితో హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ అంబేడ్కర్ సెంటరు నుంచి గుళ్ళపల్లి చెరుకుపల్లి ఖాతర్ఖాన్ సెంటర్ వరకు ద్విచక్ర వాహనాలపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే వారు ప్రమాదశాత్తు రోడ్డు ప్రమాదం జరిగితే ఎక్కువగా తలకు తీవ్రగాయాలై మరణిస్తున్నారని దీంతో ఇంటి యజమానిని కోల్పోయి ఆ కుటుంబాలు ఛిన్నాభిన్నమై పోతున్నాయన్నారు. దీనిపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కూడా హెల్మెట్ లేకుండా వాహనం నడపటం నేరమని అలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించటం జరిగిందన్నారు. కావున ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనం నడపాలని లేని పక్షంలో వారికి అపరాధ రుసుం విధించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రేపల్లె రూరల్ సీఐ సురేష్బాబు, స్థానిక ఎస్సై అనీల్కుమార్, నిజాంపట్నం ఎస్సై తిరుపతిరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బడుగు..బలహీన వర్గాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం

**ప్రముఖ సామాజిక వేత్త డాక్టర్ గోళ్ళమూడి రాజసుందర్బాబు**



జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేస్తున్న గోళ్ళమూడి రాజసుందర్బాబు, దళిత సంఘాల నాయకులు

**బాపట్లటౌన్:** బడుగు బలహీన వర్గాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ గోళ్ళమూడి రాజ సుందర్బాబు తెలిపారు. పేదలకు రావాల్సిన హక్కులు కల్పించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్కు వినతిపత్రాన్ని అందజేశారు. రాజసుందర్బాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ ఆశించిన విధానంలో దేశంలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన రిజర్వేషన్లు అమలు కాలేదన్నారు. రిజర్వేషన్లను తుంచే కన్నా, పెరిగిన జనాభా నిష్పత్తిలో వాటిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ రంగంలో ఉద్యోగ, ఉపాధి పూర్తిగా అడుగంటి పోయాననిప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల విధానం తెచ్చేందుకు ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్లో దళిత యూనివర్సిటీని అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో ప్రజా సంఘాల నాయకులు రాజారావు, శ్రీనివాసరావుయాదవ్, కూరేటి మాణిక్యరావు, పుట్టా రవీంద్ర, జానకిరామ్ పాల్గొన్నారు.

# ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు



మండల సమాఖ్య ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలలో ఎంపీపీ, జెడ్పీటీసీలు

**రేపల్లె రూరల్:** రేపల్లె బార్ అసోసియేషన్ హాలులో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కేశన వెంకట గోపాలరావు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి క్రీస్తు సందేశాన్నిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు గుజ్జర్లమూడి ప్రశాంత్కుమార్, దారం సాంబశివరావు, బొర్రా శ్రీనివాసరావు, ఐజ్, దోవా రమేష్రాంజీ, శ్రీనివాసరావు, కర్రా ప్రతాప్, జీవన్కుమార్, వెంకటేశ్వరరావు, దీవి శ్రీనివాస హరికుమార్, ఎం.విజయకుమారి, గుమ్మడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**పాపులను రక్షించే దేవుడు క్రీస్తు**

**భట్టిప్రోలు:** క్రీస్తు పాపులను రక్షించేందుకు భూమిపై జన్మించిన దేవుడని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరిలు అన్నారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సమాఖ్య ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం కేక్ను అధికారులు, ప్రజా ప్రతినిధులు, మండల సమాఖ్య సిబ్బందికి తినిపించారు. అందరికి ముందస్తుగా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ క్రీస్తు నామం వల్ల ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆయన ఆపదలో ఉన్న వారికి దేవుడని తెలిపారు. ప్రతి ఒక్కరి విజయంలో క్రీస్తు తన ముద్రను చూపుతాడన్నారు. జెడ్పీటీసీ ఉదయ భాస్కరి మాట్లాడుతూ క్రిస్మస్ను సుఖ సంతోషాలతో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. బ్రదరన్ సంఘం పాస్టర్లు బెజ్జం సత్యంబాబు, ఏలియాలు క్రీస్తు సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వెంకట రమణ, మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ (భట్టిప్రోలు), జి.రాము(కొల్లూరు), ఈవోపీఆర్డీ టి.ఊహారాణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు జాలాది ధనలక్ష్మి, ఎఫ్పీవో అధ్యక్షురాలు దోవా ఝాన్సీరాణి, స్త్రీ నిధి మేనేజర్లు పిల్లి అశోక్, కాకి రాహుల్, సీసీలు, యానిమేటర్లు, వీవోఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు**

**రేపల్లెరూరల్:** ప్రజా ఉద్యమాలకే పరిమితం కాకుండా ప్రజల మానసిక ఉల్లాసం, విద్యార్థుల అభ్యున్నతికి సైతం ప్రజా సంఘాలు పనిచేస్తాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. క్రిస్మస్ను పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ఐద్వా తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వెలమవారిపాలెం గ్రామానికి చెందిన డాక్టర్ క్రాప రాహుల్కుమార్ ఆర్థిక సహకారంతో మండలంలోని బేతపూడి గ్రామంలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రిస్మస్ను పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు డ్యాన్స్ పోటీలు, మ్యూజికల్ చైర్స్ నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ప్రజా సంఘాల నాయకులు ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కేవీ లక్ష్మణరావు, కె.ఝాన్సీ, వై.నవీన్, పి.నిఖిత, జె.ధర్మరాజు, బి.నాగరాజు, కె.ఆశీర్వాదం, కె.రమేష్, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న చిన్నారులు



డ్యాన్స్ పోటీలలో చిన్నారులు

# దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**హెచ్ఎం వనజాక్షి**



**చెరుకుపల్లి:** దాతలు అందిస్తున్న సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కావూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వనజాక్షి పేర్కొన్నారు. మండల పరిధిలోని కావూరు గ్రామానికి చెందిన డాక్టస్ సాఫ్ట్వేర్ సంస్థ మధ్యాహ్న భోజనం చేసేందుకు పాఠశాలలోని 250 మంది విద్యార్థులకు భోజన ప్లేట్లు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ డాక్టస్ సంస్థ వారు కావూరు కళాశాలకు, పాఠశాలకు ఇప్పటి వరకు ఎంతో సహకారం అందించారని, వారు అందిస్తున్న సహకారానికి వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ మేనేజర్ ధనుంజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**బాపట్లటౌన్:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని వెదుళ్ళపల్లి సమీపంలో చోటుచేసుకుంది. వెదుళ్ళపల్లికి చెందిన కె.నవీన్ ద్విచక్రవాహనంపై బాపట్ల వైపు వస్తున్నారు. అదే సమయంలో బాపట్ల నుంచి చీరాల వైపు వెళ్తున్న కారు బధిరుల పాఠశాల సమీపంలో ఢీకొట్టింది. ఈ ఘటనలో నవీన్కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

### సమస్యల పరిష్కార వేదికకు 3 అర్జీలు

**రేపల్లె రూరల్:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 3 అర్జీలు అందినట్లు ఆర్డీవో నేలపు రామలక్ష్మి తెలిపారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. మురుగునీటి పారుదల సమస్యపై 1, మురుగు కాల్వల్లో పూడికతీతలపై 1, భూమిని ఆన్లైన్ చేయాలని కోరుతూ 1 చొప్పున మూడు అర్జీలు అందాయన్నారు. సమస్యలు ఆయా శాఖల అధికారుల ద్వారా త్వరితగతిన పరిష్కారం అయ్యేలా కృషి చేయటం జరుగుతుందన్నారు.

### 'తెల్లాకుల'కు ఘన నివాళి

**తెనాలిరూరల్:** పట్టణానికి చెందిన హరికథ, బుర్రకథ కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యా దానకర్ణ, యక్షగాన కళానిధి, హరికథాచార్య తెల్లాకుల వెంకటేశ్వర గుప్తా భాగవతార్ జయంతి మహోత్సవాలు, మధుర గాయని మామిడి సరస్వతి భాగవతారిణి సంస్మరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. స్థానిక మారిస్పేటలో బాలా త్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణ మండపంలో ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన కార్యక్రమాల్లో వెంకటేశ్వర గుప్తా కుటుంబ సభ్యులు, తెలుగు రాష్ట్రాల్లోని ఆయన శిష్యులు పాల్గొని, గుప్తా, ఆయన కుమార్తె చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ పేరెన్నిక గన్న గుప్తా శిష్య బృందం హరికథ గానం చేశారు. ప్రముఖ హరికథకులు బి.లక్ష్మీనారాయణ, మొగలిచర్ల నాగమణి, సీహెచ్ ఆంజనేయరాజు, కె.శారద ఎస్.వేదవతి, విన్నకోట రామకుమారి, ఎం.సింహాచలశాస్త్రి భాగవతుల హరికథా గానంతో ప్రేక్షకులను విశేషంగా అలరించారు. రాత్రికి నిర్వహించిన సభలో ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్, తెనాలి పట్టణ కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి, కోట అక్కేశ్వరరావు, కన్నెగంటి మురళీకృష్ణ, నన్నపనేని రాంబాబు, సీహెచ్ విద్యావతి పాల్గొని వెంకటేశ్వర గుప్తా కళామతల్లికి అందించిన సేవలను గుర్తు చేశారు. ప్రముఖ మృదంగ, వయోలిన్, తబల, హార్మోనిస్ట్, డోలక్, ఫ్లూట్ విద్వాంసులు మోదుకూరి నగధరరావు, పాణ్యం దక్షిణామూర్తి, ఎ.లక్ష్మీనారాయణ, సింహాద్రి నాగేంద్రప్రసాద్, టీవీ కృష్ణ, చావలి శ్రీనివాస్, చింత ఈశ్వర్ శర్మ, సీతాపతిరావు, ఎం.కేశవరావు, కుమార్ బాబు వాయిద్య కళాకారులుగా సహకారం అందించారు.